18,268 టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని 24 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి సూచించారు. స్థానిక కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వింటాలకు రూ.2,300 కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. మండలంలో 18,268 టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యంగా నిర్వహించామని చెప్పారు. మండల పరిధిలో ఆరు రైస్ మిల్లులను ధాన్యం కొనుగోలుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిటిపి కూర్మారావు పాల్గొన్నారు.

కపాసుకుద్దిలో ఎగసిపడుతున్న అలలు

'అల' కల్లోలం

కవిటి : తుపాను నేపథ్యంలో మండలంలోని సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఎగసిపడి తీరని తాకుతున్నాయి. ఇద్దివానిపాలెంలో అలల తాకిడికి తీరం కోతకు గురైంది. మత్స్య సంపద తరలించేందుకు వేసిన రోడ్డు అలల తాకిడికి దెబ్బతింది. మరోవైపు అధికారుల ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు. తమ వేట సామగ్రి అయిన వలలు, పడవలు అలల తాకిడికి గురవకుండా భద్రపరుచుకున్నారు.

ఇద్దివానిపాలెం తీరంలో కోతకు గురైన రోడ్డు

వాన గండం

- తుపానుగా మారిన తీవ్ర వాయుగుండం
- జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు
- అత్యధికంగా కళింగపట్నంలో 10.5 మి.మీ
- నేడూ జిల్లావ్యాప్తంగా వర్షాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం పెంగల్ తుపానుగా మారింది. దీని ప్రభావంతో శుక్రవారం జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. గార మండలం కళింగపట్నంలో అత్యధికంగా 10.5 మి.మీ వర్షం కురిసింది. జలుమూరులో 9.75 మి.మీ వర్షం పడింది. రణస్థలం మండలం పైడిభీమవరంలో 9.5 మి.మీ, లావేరు మండలం తామాడలో 9 మి.మీ, రణస్థలం మండలం గరికిపాలెంలో 8.75 మి.మీ వర్షపాతం నమోదైంది. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 8.5 మి.మీ, శ్రీకాకుళంలో 7.75 మి.మీ, సంతబొమ్మాళిలో 7 మి.మీ, పోలాకిలో 6.5 మి.మీ వర్షం కురిసింది. నరసన్నపేట, ఎచ్చెర్లలో 6 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆమదాలవలస, పొందూరులో 5.5 మి.మీ చొప్పున వర్షం పడింది. తుపాను ప్రభావంతో జిల్లాలో శనివారమూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

బూర్జ: ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలకు వాయు గండం తప్పడం లేదు. కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాను రైతు నడ్డి విరుస్తుంది. మండలంలో రైతులు ఇప్పటికే సగం వరకు కోతలు పూర్తి చేశారు. మరికొంత మంది నూర్పులు చేసి ధాన్యాన్ని తేమ ఆరెందుకు గాలి కుప్పలు వేస్తున్నారు. మరో పది రోజులు పూర్తిస్థాయి కోతలు పూర్తవుతాయి. అయితే ఈలోపే తుపాను కారణంగా విస్తారంగా వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం

బూర్జ : పంట పొలం నుంచి ఇంటికి తరలిస్తున్న వరిచేను

కోతలు కోసి నూర్పులు చేసిన ధాన్యం కళ్ళల్లో ఉండడంతో తడిచి ముద్దవుతాయి. ధాన్యం తడిస్తే రంగు మారుతుందని, దళారులు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తారని మదనపడుతున్నారు. భారీ వర్షం కురుస్తుండడంతో రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుకోవడం, ధాన్యం రాశులను తడవకుండా కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు.

పాతపట్నం: తుపాను ప్రభావంతో మండలంలోని ప్రహరాజపాలెం, కొరసవాడ, బూరగాం, లోగిడి, గంగువాడ, తెంబూరు గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి చేను కోసి ఉండడంతో తడిచిపోయాయి. మరికొంతమంది ఆదరాబాదరగా పొలాల్లో కుప్పలు పెట్టారు. అలాగే యంత్రాలతో వరి నూర్పు చేపట్టారు. కళ్లాల్లోకి పంటలను తీసుకొచ్చి టార్పాలిన్లను కప్పుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమం

- ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి
- వామపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కష్ణమూర్తి, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిక్కాల గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 'విద్యుత్ భారాలను ప్రజలపై వేయొద్దు' అనే అంశంపై నగరంలోని ఎన్‌జిఒ హోంలో వామపక్షాల ఆధ్వర్యాన శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజల పాలిట ఉరితాళ్ళగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహ అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, నివాసాలకూ పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన తీవ్రంగా వ్యతిరేకించాయని, వాటిని పగులగొట్టాలని పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. అదానీ, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కై మీటర్లు పెడుతున్నారని ఆరోపించిన వారు ఆ ఒప్పందాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రజలు మోస్తున్నారని వివరించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచిస్తున్నారన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరు వల్ల ప్రజలు ముందుగా డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారమే మిగులుతుందన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారని చెప్పారు. విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రివేళల్లో అధిక రేట్లు వసూలు చేయడం వల్ల ప్రజలకు తలకు మించిన భారం పడుతుందన్నారు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. భారం ఉండదని రైతులకు నమ్మబలికి ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెట్టేందుకు ప్రజలపై భారాలు వేస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్‌ను దశల వారీగా తొలగించేందుకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపికి నాటి వైసిపి, నేటి టిడిపి కూటమి ప్రభుత్వాలు మోకరిల్లుతున్నాయని విమర్శించారు. సమావేశంలో సిపిఎం నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, కె.సూరయ్య, ఎం.గోవర్ధనరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి

ఉత్తరాంధ్ర రోడ్లను అభివృద్ధి చేయాలి

కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈమేరకు ఢిల్లీలో ఆయన్ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా మీదుగా విస్తరించి ఉన్న 16వ నంబరు జాతీయ రహదారిని నరసన్నపేట - ఇచ్ఛాపురం మధ్య ఆరు లైన్లకు విస్తరించాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విశాఖపట్నం మధ్య రహదారికి అనుబంధంగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని కోరారు. దీనివల్ల విశాఖ ఎయిర్‌పోర్టుకు సైతం సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం మధ్య ఉన్న సిఎస్‌పి రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒడిశాలోని రాయఘడ, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో జిల్లా రహదారులను అనుసంధానం చేయాలన్నారు. అలికాం - బత్తిలి రోడ్డు, డోల - పోలాకి - నౌపడ రోడ్డును విస్తరించడం ద్వారా నరసన్నపేట - నౌపడ - మూలపేట పోర్టు - మెళియాపుట్టి) మార్గంలో కీలక పురోగతి సాధించవచ్చని వివరించారు. దీని ద్వారా లక్ష మందికి పైగా ప్రజలు, రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు.

గడ్కరీతో చర్చిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

చెత్త సేకరణతోనే గ్రామాల పరిశుభ్రత

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గ్రీన్ అంబాసిడర్స్ ఈ బాధ్యతను నిర్వర్తించేలా పంచాయతీ కార్యదర్శి, ఇఒపిఆర్‌డిలు పర్యవేక్షించాలని ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని రాగోలులో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రంలో వసతులు, వర్మీ తయారీకి ఏర్పాటు చేసిన విట్స్‌ను పరిశీలించారు. ఇంకా ఎక్కువగా వర్మీ తయారీకి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి తిరుమలా దేవిని ఆదేశించారు.

ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం సుందరీకరణకు సిఆర్‌ఎస్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. వర్మీ కంపోస్టు విక్రయించేందుకు కేంద్రం బయట స్టాల్‌ను నిర్మించాలని సర్పంచ్ గేదెల చెంగలరావుకు సూచించారు. కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, ఇఒపిఆర్‌డి, డిపిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి అటవీ రేంజర్ జి.జగదీశ్వరరావు అన్నారు. సంతబొమ్మాళి మండలం నుంచి రోగిని శుక్రవారం తెల్లవారుజామున శ్రీకాకుళం ఆస్పత్రికి 108 సిబ్బంది తరలిస్తుండగా... మండలంలోని పొడుగుపాటు సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా వాహనానికి ఎదురుగా పులి వచ్చిందన్నారు. వాహన డ్రైవర్ ఉప్పాడ అప్పలనాయుడు భయభ్రాంతులకు గురై సైరన్ మోగించిటంతో పులి వేగంగా పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయిందన్నారు. అయితే అంతలోనే డ్రైవర్ పరిసర ప్రాంతాల్లోని మిత్రులను అప్రమత్తం చేస్తూ.. అటవిశాఖ అధికారులకు సమాచారం ఇస్తారని అన్నారు. దీంతో శుక్రవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పులి పాదాల ముద్రలను పరిశీలించారు. పులి పాదాల ముద్రలను కొలతలు వేసి పరిశీలించగా... అదే పులి పాదాలేనని నిర్ధారించామని ఎఫ్ఆర్ఒ జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒలు కృష్ణారావు, నరేంద్ర, పినకాన జాన్సి, జనప్రియ, రజింత్‌కుమార్, ఎబిఒ కుమార్, ఎబిఒ జిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పులి పాదాల అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు

రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ బాబూరావు

ప్రారంభిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఏర్పడి చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కల్లాల వద్ద ధాన్యం కొనుగోలు చేసి వాహనంలో లోడ్ చేసి రైతులు కోరిన మిల్లుకు చేర్పిస్తామన్నారు. రైతులే వాహనం ఏర్పాటు చేసుకుని మిల్లులకు ధాన్యాన్ని చేర్చుకుంటే రవాణా ఖర్చులూ ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. గోనిసంచుకు రూ.6.17, హమాలి కూలి క్వింటాకు రూ.17.17లు ఇస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మకుండా దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, మాజీ ఎంపిపి కృష్ణమూర్తినాయుడు, తహశీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి, లొడగల కామేష్, అధ్యక్ష, కార్యదర్శులు కుత్తమ్ లక్ష్మణ్, దువ్వాడ సంతోష్, రామన్నాయుడు, అగ్రికల్చర్ ఎడి మధు, ఎఒ పోలారావు, పిఎసిఎస్ సిఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగ నోటీసు

మహారాజశ్రీ టెక్కలి సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

I.P.No: 04/2023

Between:
మాగాపు సబితా దేవి ......Petoitioner
And:
వల్లభ మల్లయ్య వగైరాలు ......Respondents
To,
మళ్ళ శుభాషిని, W/o మళ్ళ జయమన్మధరావు, R/at ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్, టెక్కలి టౌన్ & మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు I.P. రెస్పాండెంట్స్‌పై మహారాజశ్రీ టెక్కలి సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో insolvency కొరకు ధాఖలు చేయడమైనది. పై నెంబరు పిటీషనులో 9వ రెస్పాండెంటుకు పలు ధపాలుగా నోటీసు జారీ చేసినప్పటికీ అమలు జరుపుటకు వీలు పడనందున U/o V rule 20 CPC ప్రకారము ప్రత్యామ్నాయంగా సమను ఇందు మూలంగా శ్రీ టెక్కలి సీనియర్ సివిల్ జడ్జ్ వారి ఆదేశానుసారం జారీ చేయడమైనది. కనుక ఈ సమను అందిన వెంటనే మీరు గానీ మీ తరుపున వకీలు గానీ **తేది 06-12-2024 న ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరు కాగలరని, లేని యడల మీ పరోక్షమున తీర్మానించగలరని తెలియజేయడమైనది.

(పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

పి.సి.హెచ్. అజాద్
న్యాయవాది,
టెక్కలి.

టెక్కలి,
తేది: 30-11-2024.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే కూన రవికుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని దన్నానపేట వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. యువతలు నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఉపాధి కల్పించేందుకు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ఐటిఐను తొందరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో నిర్మిస్తున్న మూలపేట పోర్టు, విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్‌పోర్టుకు కావాల్సినఉద్యోగాలకు యువతీ యువకులకు అవసరమైన శిక్షణలు అందించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా జాబ్‌మేళాకు ఐదు ప్రయివేటు సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 113 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలు హాజరయ్యారు. వీరిలో 32 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. అనంతరం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ లేఅవుట్లు, 2.0 హౌసింగ్ సర్వేపై రెవెన్యూ, హౌసింగ్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల సచివాలయ సర్వేయర్లతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు గోపి, సిఇఒ విభాగాధిపతి శ్రీనివాసరావు ఎంపిటిసి గొర్లె సూర్యం, తహశీల్దార్ ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- పలాస

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పరిశీలించి శతశాతం పరిష్కారానికి తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి 20 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజా సమస్యలను విని సానుకూలంగా స్పందించి వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఇందులో సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, అదృశ్యం, ఇతరత్రా అంశాలపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణతో మాలలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని, వర్గీకరణకు వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఉద్యమం తప్పదని వక్తలు హెచ్చరించారు. వర్గీకరణకు మద్దత్‌గా నిలుస్తున్న రాజకీయ పార్టీలు రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యాన శుక్రవారం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానం ప్రారంభించిన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. అంతకుముందు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కళ్లేపల్లి రాంగోపాల్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ర్యాలీ అనంతరం డచ్ భవనం వద్ద సభ నిర్వహించారు. ఈ సభలో ఎస్‌సి సంఘాల నాయకులు పి.ఎస్.ఎన్.మూర్తి, మల్లెల వెంకటరావు, మంచె నాగమల్లేశ్వరి, బొడ్డేపల్లి నరసింహులు, పాత్తేటి పెంటారావులు పాల్గొని మాట్లాడారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఎస్‌సిలను వర్గీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు. వర్గీకరణతో ఎస్‌సిలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ణయాన్ని వెక్కితీసుకోకపోతే వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించి తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు సిద్ధపడుతుందని అన్నారు. ఈ తరుణంలో ఎస్‌సిలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో షెడ్యూల్ తరగతులకు, తెగలకు చెందిన 109 మంది ఎంపిలు ఉన్నారని, వారంతా దళిత, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల శాతం పెంచాలని డిమాండ్ చేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేసేలా పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో-కన్వీనర్ డాక్టర్ కంఠ వేణు, ప్రతినిధులు బడే కామరాజు, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్ పాల్గొన్నారు.

ర్యాలీ పోరాట సమితి నాయకులు

సర్వజన ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఆక్యుపెన్సీరేషియో ఆదారంగా బెడ్లు అందుబాటులో ఉన్నాయని, వైద్య సేవలు అందించడానికి వైద్యులు తమ వంతు కృషి చేయాలన్నారు. రోగులకు అవసరమైన వైద్య, మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ఆస్పత్రిని సందర్శించి అదనపు మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించారని చెప్పారు. సిటీ స్కాన్, ఎక్స్‌రే అందుబాటులో ఉన్నా సక్రమంగా వినియోగించడానికి వీలుగా పనిచేయడం లేదని, దీనివల్ల ప్రైవేటు కేంద్రాల్లో పరీక్షలు చేయించాల్సి వస్తోందని వైద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా ఈ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ దాసరి షకీల తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి వాటి కొనుగోలుకు అనుమతించేందుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆస్పత్రికి వచ్చే పేదలపై మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అంతకుముందు ఆయన వార్డులను పరిశీలించారు. సమావేశంలో రిమ్స్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు

S.O.P. 2/2024

Between:-
1. చెన్నంశెట్టి ధనరాజు, S/o లేటు పాపారావు, వయస్సు 24 సం॥లు, ప్రైవేట్ వెల్డర్, డోర్ నెం. 2-36, గుణాలపాడు గ్రామం, పూండి ఆర్.ఎస్.& పోస్టు, వజ్రపుకొత్తూరు మండలం. శ్రీకాకుళం జిల్లా..
2. చెన్నంశెట్టి యుగంధరరావు, S/o లేటు పాపారావు, వయస్సు 22 సం౦ఎలు, మెకానిక్ హెల్పర్, డోర్ నెం. 2-36, గుణాలపాడు గ్రామం. పూండి ఆర్.ఎస్,& పోస్టు, వజ్రపుకొత్తూరు మండలం. శ్రీకాకుళం జిల్లా.
3. కాలువ జ్యోతి, W/o కాలువ భీమారావు, D/o లేటు చెన్నంశెట్టి పాపారావు, వయస్సు 30 సం॥లు, గృహకృత్యం, డోర్ నెం. 2-42, అల్లిమెరక కోలనీ, అల్లిమెరక గ్రామం, రంగోయి పోస్టు, మందస మండలం, శ్రీకాకుళం జిల్లా.
4. చెన్నంశెట్టి పాప, W/o లేటు చెన్నంశెట్టి పాపారావు, వయస్సు 30 సం॥లు, గృహకృత్యం, డోర్ నెం. 2-36,గుణాలపాడు గ్రామం, పూండి ఆర్.ఎస్.,& పోస్టు, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా. ......పిటిషనర్

And: **Nil** ......రెస్పాండెంట్

పై నెంబరు పిటిషన్లో పిటిషనర్లు కాలం చేసియున్న చెన్నంశెట్టి లేటు పాపారావు యొక్క వారసులు అయియున్నారు. సదరు పిటిషనర్లు మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో SBI, Govindapuram Branch ద్వారాSBI General Insurance మరియు Pradhana Mantri Suraksha Bheema Yojana లకు సంబంధించిన పైకం రూ॥ 4,00,000/- లు మరియు రూ॥ 2,00,000/-లు రాబట్ట గోరి **Succession Certificate** ఇప్పించ గోరి పై కోర్టులో పిటిషను దాఖలు చేసియున్నారు. పై పిటిషను **తే 10-12-2024 దీన వాయిదా అయి ఉన్నది.** ఈ పేపరు ప్రకటన మూలంగా పబ్లిక్ నోటీసు జారీ చేసియున్నారు. కావున ఈ పేపరు ప్రకటన మూలంగా తెలియజేయునది ఏమనగా పై తెల్పిన తేదీన **ఉదయం 10-30 గంటలకు** ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టునందు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని పక్షమున పై పిటిషన్ విచారించి తగు విధంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

యమ్. చలపతిరావు
న్యాయవాది,
సోంపేట, సెల్ : 9440550328.

అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

క్రీడా మైదానం పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని ఆక్రమణలకు గురవుతున్న సురంగి క్రీడా మైదానాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శుక్రవారం పరిశీలించారు. క్రీడా మైదానంలో సగభాగాన్ని గుర్తించి ఆక్రమణలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రమేష్, తహశీల్దార్ వెంకటరావులను ఆదేశించారు. ఆక్రమణలకు గురవుతుండడంతో క్రీడా మైదానం విస్తీర్ణం తగ్గుతుందన్నారు. అధికారులు సంయుక్తంగా ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాజావారి మైదానంలో ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు సందిక జాని, కాళ్ల దిలీప్‌కుమార్, సందిగాం కోటేశ్వరరావు, దక్కత విశ్వనాథరెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, లీలారాణి, రెయ్య జానకిరావు, ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

పాఠశాలల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత నానాటికీ ప్రశ్నార్థకంగా మారుతుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. పాఠశాల పనివేళలు పెంచడం వలన దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులకు ముఖ్యంగా ఆడపిల్లల భద్రతారీత్యా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారిని ఇళ్లకు చేర్చే విధంగా రవాణా సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రామకృష్ణారావు, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, మండల బాధ్యులు ఎస్.రామన్న, డి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ రజని

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పర్చుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని, వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని వక్తలు సూచించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'ఫ్రెషర్స్'డే వేడుక శుక్రవారం క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంజనీర్లుగా రాణించే వారు, సమాజ శ్రేయస్సును కోరే విధంగా వృత్తి కొనసాగించాలన్నారు. అపారమైన ఉపాధి అవకాశాలు మేథ్స్, సైన్స్, ఇంజినీరింగ్ మిళితమైన రంగాల్లో ఉన్నాయని, వాటిని అంది పుచ్చుకోవడానికి విద్యార్థులు సన్నద్ధులుగా ఉండాలన్నారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఇంజినీర్ డా. పి.సుగుణాకరరావు మాట్లాడుతూ స్వీయ ప్రేరణ, నిరంతర అభ్యసన, సాధించాలని తపన ఉన్న విద్యార్థులే విజేతలుగా నిలవగలరన్నారు. కార్యక్రమంలో ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్.రాజశేఖరరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.అనురాధ, పలు విభాగాల కో-ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న లలితకుమారి

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

మెళియాపుట్టి: గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి అన్నారు. గ్రామ శివారు నుంచి శ్మశాన వాటిక వరకు రోడ్డు, కల్వర్టు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని విమర్శించారు. కార్యక్రమంలో మలగాపు ఆనందరావు, మడపాల శశిభూషనరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

విశ్వసనీయతతోనే వృద్ధి

శ్రీకాకుళం: నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకోవడంతో పాటు కస్టమర్ల విశ్వసనీయతను హారికా కన్‌స్ట్రక్షన్ సంపాదించుకుందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని సానావీధిలో హారికా కన్‌స్ట్రక్షన్ కార్యాలయం వద్ద 15వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన పాల్గొని హారికా ప్రసాద్ పాటు సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హారికా కన్‌స్ట్రక్షన్ ద్వారా ఎందరికో ఉపాధి కల్పించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందడానికి ఎంత శ్రమించామో, అంతకు రెట్టింపు నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ కోమటి కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్య క్షులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, జోన్ చైర్‌పర్సన్ కరణం శోభా రాణి, మండవిల్లి రవి, ప్రముఖ పారిశ్రామికవేత్త అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హారికా ప్రసాద్‌కు కేకు తినిపిస్తున్న మాజీ మంత్రి ప్రసాదరావు

సాగునీటి సమస్య తీరేనా?

- పూడికతో సాగునీటి కాలువలు
- వంశధార - బాహుదా అనుసంధానంపై పోరాటం
- ఆశగా ఎదురుచూస్తున్న ఉద్దానం రైతులు

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుతం వంశధార సాధన కమిటీ పేరుతో స్థానికంగా సాగునీటి కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. వంశధార బాహుదా నదుల అనుసంధానంపై దృష్టిసారించి నియోజకవర్గానికి సాగునీరు అందించే బాధ్యత తీసుకుంటామని కూటమి ప్రభుత్వం చెప్పడం నియోజకవర్గ రైతాంగానికి ఊరట కలిగించే అంశం. సోంపేట మండలం పైడిగాం ఛానెల్ 69 చెరువులతో అనుసంధానం కలిగి ఉంది. రుషికుడ్డ, బెంకిలి, కుత్తుమలో మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 18 ఎంఐ, 48 పిఆర్ ట్యాంకులు ఉన్నాయి. కంచిలి మండలంలో 24 ఎమ్ఐ, పిఆర్ ట్యాంకులు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలంలో 129 పిఆర్, ఎంఐ ట్యాంకులు ఉన్నాయి. కవిటి మండలంలో 103 పిఆర్, ఎమ్ఐ ట్యాంకులు ఉన్నాయి.

కానీ ఇవన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయా? అంటే లేదనే చెప్పాలి. వీటి మరమ్మతులకు కూడా సరైన నిధులు లేక కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికి తోడు బాహుదా, మహేంద్ర తనయా నదులపైన ఒడిశా ప్రభుత్వం ఆనకట్టలు కట్టేయడంతో దిగువకు నీరురాక సాగు సన్నగిల్లుతోంది. ఈ ప్రభావం నియోజకవర్గ రైతాంగంపై తీవ్రంగా చూపిస్తోంది.

వంశధార సాధన కమిటీ పోరాటం

ఇటువంటి పరిస్థితుల్లో వంశధార బాహుదా నదుల అనుసంధానం ద్వారా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సాగునీరు అందించాలని కోరుతూ వంశధార సాధన కమిటీ పేరుతో గత రెండేళ్లుగా రైతులు, మేధావులు పోరాటం కొనసాగిస్తున్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం పెద్దలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలను కలుస్తూ తమ సమస్యలు వివరిస్తున్నారు. ఇటీవల నియోజకవర్గం వచ్చిన నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులను కలిసి వంశధార బాహుదా నదుల అనుసంధానం ఆవశ్యకతను వివరించారు. నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందిస్తే ఉద్దానం ప్రాంతం మరో ఉద్యానవనంగా అలలారుతుందని వీరి ప్రయత్నం.

టిడిపి హయాంలో..

2017లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హిరమండలం రిజర్వాయరు నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు హైలెవెల్ కెనాల్ ప్రపోజల్ రూపొందించారు. దానికోసం టెండర్లు కూడా పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో ప్రభుత్వ మారిపోవడం కొత్త ప్రభుత్వం కొన్ని సాంకేతిక కారణాలతో దాన్ని రద్దు చేయడం నియోజకవర్గం రైతాంగానికి శాపంగా మారింది. అయితే 2024 ఎన్నికల సమయంలో నియోజకర్గానికి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎన్నికల అనంతరం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను వంశధార సాధన కమిటీ కలిసి నియోజకవర్గ రైతాంగ సమస్యలను, సాగునీటి ఆవశ్యకతను వివరించింది. దీనికి వారు స్పందిస్తూ నదీ జలాల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించి నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని చెప్పడం శుభపరిణామం.

సహకరిస్తే సస్యశ్యామలమే...

ఉద్దానం ప్రాంతం గతంలో ఉద్యానవనంగా అలరారేది. రానురాను తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఇక్కడ పరిస్థితులు తల్లకిందులు చేశాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు సహకరించి నదుల అనుసంధానం ద్వారా మాకు సాగునీరు అందిస్తే ఈ ప్రాంతం మరో కోనసీమే. వ్యవసాయరంగంతో పాటు ఎన్నో రకాల ఉద్యానవన పంటలు, ముఖ్యంగా దేశంలోనే పేరెన్నిక కలిగిన, నాణ్యమైన కొబ్బరికి మా ప్రాంతం ప్రసిద్ధి.

- బెందాళం వెంకటేశ్వరరావు, వంశధార సాధన కమిటీ సభ్యుడు

ప్రభుత్వంపై నమ్మకం ఉంది

వ్యవసాయానికి పట్టు కొమ్మలాంటి ఈ ప్రాంతం సాగునీరు లేక అల్లాడిపోవడం సరికాదు. దాన్ని దృష్టిలో ఉంచుకొని వంశధార బాహుదా నదుల అనుసంధానం కోసం రెండేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నాం. వాస్తవానికి 2017లోనే టిడిపి ప్రభుత్వం దీనిపై రూట్ మ్యాప్ రూపొందించినా కొన్ని అనివార్య కారణాలవల్ల అది మరుగునపడింది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సహకారంతో రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం.

- ప్రధాన శివాజీ, వంశధార సాధన కమిటీ కన్వీనర్, సోంపేట

నిరసన తెలుపుతున్న పాడి రైతులు

ఆవు పాల ధర పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- రణస్థలం

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాల ధర వెంటనే పునరుద్ధరించాలని, పాలుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతు సంఘం నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో ఎపి పాల రైతు సంఘం ఆధ్వర్యంలో పాల రైతుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధర తగ్గించిందన్నారు. డెయిరీకి వచ్చిన లాభాలను డెయిరీ యాజమాన్యం ప్రతి ఏడాది వందలాది కోట్లు వివిధ రూపాల్లో అవినీతి, అక్రమాలు చేసి కాజేస్తున్నారని, నష్టాలు చూపిస్తున్నారని విమర్శించారు. విశాఖ డెయిరీ అభివృద్ధి చెంది, లాభాలతో అనేక అనుబంధ రంగాలు స్థాపించడానికి కీలకమైన పాల రైతులకు గిట్టుబాటు ధర, వచ్చిన లాభాల్లో వాటా రైతులకు ఇవ్వడం లేదన్నారు. పాలకేంద్రాల్లో సిబ్బందికి కనీస వేతనం ఇవ్వడం లేదని, సంఘాల ఆర్థిక పరిపుష్టికి న్యాయంగా ఇవ్వాల్సినవి ఇవ్వకుండా యాజమాన్యం దోచుకుంటుందన్నారు. పశువుల దాణా, గడ్డి, మందులు, తదితర పెట్టుబడి పెరిగిపోతుంటే రైతులకు ఇచ్చే పాలధర పెంచాల్సిందిపోయి తగ్గించడం అన్యాయమన్నారు. ఆవుపాలకు తగ్గించిన ధర వల్ల లీటరుకు మూడు నుంచి నాలుగు రూపాయలు తగ్గుతుందన్నారు. పాలు కొనుగోలు చేసే ప్రజలకు (వినియోగదారులకు) అమ్మే పాలధర తగ్గించలేదన్నారు. రైతులు పాడి పశువులకు భీమా, పాల రైతులకు జనశ్రీ కట్టే ప్రీమియం, డెయిరీ తీసుకొని తమ వద్ద ఉంచుకుంటున్నారని, అదే సొసైటీ వద్ద ఉంచితే క్లైమ్ వెంటనే పరిష్కారం చేయవచ్చునని, కేంద్రానికి ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. విశాఖ డెయిరీ పశువుల మందుల కొనుగోలులో కూడా కమిషన్లను మేనేజ్‌మెంట్ కాజేస్తుందని విమర్శించారు. పాలరైతులతో, సొసైటీలతో చర్చించకుండా ఏక పక్షంగా ఆవుపాల ధర తగ్గింపు నిర్ణయం చేశారన్నారు. తగ్గించిన ఆవు పాల ధర వెంటనే వెనక్కి తీసుకోవాలని డిసెంబరు 2న గాజువాక వద్ద గల విశాఖ డెయిరీ వద్ద జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

సిఎస్‌పి రహదారి బిల్లు మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం - ఆమదాలవలస ప్రధాన రహదారి పెండింగ్ బిల్లును ప్రభుత్వం చెల్లించింది. రోడ్లు భవనాల శాఖ జిఒ ఆర్టి నెంబర్ 361 సెంట్రల్ రోడ్ స్కీం నుంచి సిఎస్‌పి రోడ్డు 28/6 నుంచి 39/0 కిలోమీటర్లు శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు పెండింగ్ బిల్లులు చెల్లించుటకు ప్రభుత్వం రూ.9 కోట్ల 88 లక్షలు గురువారం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబునాయుడు, రోడ్లు భవనాల శాఖామంత్రి బి.సి. జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయివేటు వాహనాల తనిఖీ

పలాస : పలాస వరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రయివేటు వాహనాలను ఆర్‌టిసి, ఎంవిఐ అధికారులు శుక్రవారం ఉమ్మడిగా తనిఖీ చేశారు. ఈ ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రయివేటు, బస్సులను, ఆటోలను ఎంవిఐ వై.శ్రీనివాసరావు, ఆర్‌టిసి సిఐ సంతోష్, డిపో మేనేజర్ సీతారామమూర్తిలు తనిఖీ చేశారు. వాహన పర్మిట్లను పరిశీలించారు. పర్మిట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై జరిమానాలు విధించారు. పరిమితికి మించి ఆటోలో ఎక్కించరాదన్నారు.

సిసి రోడ్ల పనులను పరిశీలిస్తున్న డిఇఇ శ్రీరాములు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో మూడు మండలాల్లో 375 పనులకుగాను రూ.20 కోట్లు మంజూరై శరవేగంగా సిసి రోడ్లు, కాలువ పనులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ డిఇఇ సనపల శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లవలస, గోవిందపురం, ఇజ్జడాపాళెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న సిసి రోడ్లు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్ల డివిజన్ పరిధిలోని లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాలకు 375 పనులకుగాను రూ.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. సిసి రోడ్ల నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. పనులను త్వరితగతిన జరపాలన్నారు. తాళ్లవలసలో సిసి రోడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ముప్పుడి మురళీమోహనరావు ఉన్నారు.

వితంతువులకు సన్మానిస్తున్న వెంకటేష్

వితంతువులకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వ్యాపారవేత్త, విఎన్ఎం ఫౌండేషన్ చైర్మన్ వజ్రపు వెంకటేష్ తన కుమారుడు వివాహం సందర్భంగా తల్లివందనం పేరుతో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గొల్లవీధిలోని ఉన్న చర్చ్‌లో దాదాపు రెండు వేల మంది వితంతువులకు దుశ్శాలువ కప్పి సన్మానించి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ తప్పు చేయని వితంతువులను ఎందుకు దూరం పెట్టాలని ఆలోచనతో తల్లివందనం కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొని నూతన వధూవరులు ఆశిష్, గీతామాధురిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వెంకటేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ తరగతులను రద్దు చేయాలి

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కవిటి

ఉపాధ్యాయులకు ప్రాణ సంకటంగా మారుతున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్.బెలగాం జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్ వద్ద యూటిఎఫ్ సభ్యులతో కలిసి విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. గురువారం ఉదయం విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహించిన లీడర్ షిప్ శిక్షణ కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందిన భామిని మండలం నేరడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపురం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే ఆయన కుటుంబ సభ్యులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయుని మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ఎల్‌డిపి, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలను రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.జగదీష్, జి.సీతంనాయుడు, జి.జానకిరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సిఒపిడి పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భాగ్యరాజ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్(సిఒపిడి) పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన ప్రచురించిన వాల్ పోస్టర్‌ను ప్రముఖ ఫల్మనాలజిస్టు డాక్టరు భాగ్యరాజ్ ఆవిష్కరించారు. శుక్రవారం ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఒపిడి ఊపిరితిత్తుల్లో వచ్చే దీర్ఘకాలిక వ్యాధని, ఈ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. 65 ఏళ్ల పైబడిన వారిలోను, చిన్న పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంద న్నారు. ఈవ్యాధి పూర్తిగా నయం చేయడం సాధ్యం కాకపోయినా నివారించేందుకు అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ వ్యాధి సోకిన వారిలో శ్వాసనాళాలు, లంగ్ టిష్యూ యాల్వియోలై బాగా దెబ్బతింటాయని, అందువల్ల క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్ ఊపిరితిత్తులకు గాలిని తీసుకువెళ్లే వాయుమార్గాలను ప్రభావితం చేస్తుందన్నారు. దీనివల్ల కావాల్సినంత ఆక్సిజన్ ఊపిరితిత్తులకు అందకుండా అడ్డు పడుతుందన్నారు. శ్వాసనాళాలు తగ్గిపోవటం ప్రారంభిస్తాయని, రోగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాడన్నారు. దగ్గు, శ్లేష్మం, గురక వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. సిఒపిడి కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, గుండెపోటు, ఊపిరితిత్తుల కేన్సర్లతో మరణం సంభవించే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. కార్యక్రమంలో క్రిటికల్ కేర్ ఫిజిషియన్ డాక్టర్ సందీప్ గురుగుబెల్లి, సెంటర్ హెడ్ డా. సాగరిక తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

పలాస: పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి సుమారు పదెకరాలు వరకు స్థలం అవసరం అన్నారు. పురుషోత్తపురం సర్వే నంబరు 51లో 15 ఎకరాలు స్థలం వరకు గుర్తించామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే చాలా మంది స్థలాలను ఆక్రమించి ఉండడాన్నీ గుర్తించామని తెలిపారు. ఆక్రమణలను త్వరలో తొలగించి కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని సేకరించి శంకుస్థాపన చేస్తామన్నారు. మిగిలిన ఐదెకరాల్లో జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకూ స్థలం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్ఐ ఖగేశ్వరరావు, సర్వేయర్ గిరి, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన

శ్రీకాకుళం అర్బన్ : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీ 7వ లైన్ ఆర్‌టిసి కాలనీలో రోడ్డు పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల ఆధారంగా ఒక్కొక్కటి పరిష్కరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కలమటను అభినందిస్తున్న రవికుమార్

'కలమట'ను కలిసిన రవికుమార్

కొత్తూరు : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నామినేటెడ్ పదవుల నియమాకల్లో జనసేన పార్టీకి చెందిన కోరికన రవికుమార్ శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమించారు. దీంతో మండలంలోని మాతలలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు మంచిచేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గేదెల చైతన్య, జయరాజ్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కడుం కాలనీ పెద్దపొందర కమలమ్మ ఇంట్లో శుక్రవారం గ్యాస్ లీకై తీవ్రంగా గాయపడింది. కమలమ్మ తన చిన్న కుమారుడి ఇంటికి వెళ్లి భోజనం చేసి తిరిగి తన ఇంటికి వచ్చి వరండాలో నిద్రపోయింది. శుక్రవారం ఉదయం ఇంట్లోకి వెళ్లి కరెంట్ స్విచ్ వేసింది. అప్పటికే గ్యాస్ లీకై ఇంట్లో మంటలు వ్యాపించి ఆమెకు అంటుకుంది. వెంటనే కేకలు వేయడంతో స్థానికులు 108లో కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గురువారం రాత్రి మంచినీళ్ల వేడి చేయడం కోసం స్టవ్ వెలిగించి ఆపకపోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధి ఎస్ఎం పురం గ్రామానికి చెందిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పైల విష్ణు ఎచ్చెర్ల ఎస్‌బిఐ నుంచి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పింఛన్ నగదు డ్రా చేసి సచివాలయానికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగదు దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై ఎచ్చెర్ల పోలీసులకు సచివాలయ ఉద్యోగి విష్ణు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సందీప్‌కుమార్ వివరాల మేరకు విష్ణు ట్రిపుల్ ఐటికి వెళ్లే రహదారిలో ఉన్న మిత్ర టౌన్‌షిప్ దాటాక 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చారని, అప్పటికే విష్ణు బ్యాంకు నుంచి డ్రా చేసిన సొమ్ము రూ.24 లక్షల 64 వేలు తెస్తుండగా దుండగులు విష్ణు కుడిచేతిపై ఇనుప రాడ్‌తో కొట్టగా విష్ణు వాహన వేగం పెంచి ముందుకు వెళ్లాడన్నారు. కొంత దూరంలో గొర్రెల కాపరి ఉండటంతో దుండగులు వెనుతిరిగి పారిపోయారన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు విష్ణు డబ్బులు డ్రా చేసిన విషయాన్ని గమనించి ఈ ప్రయత్నం చేసి ఉంటారని, ఆ వ్యక్తులు ఈ ప్రాంతానికి చెందిన వారై ఉంటారని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. ఈ రహదారి మధ్యలో ఉన్న సిసి కెమేరాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

విప్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కవిటి

సొండిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సొండికుల రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీ విశ్వనాథ్ చౌదరి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి హయాంలో సొండీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వకపోగా, అయ్యరక కార్పొరేషన్‌లో చేర్చి కేవలం ఒక్క డైరెక్టర్ పదవితో చేతులు దులుపుకుందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సొండి కులస్తులకు ఉత్తరాంధ్రలో నాలుగు వైన్ షాపులు కేటాయించి తమకు అండగా నిలిచిందని అన్నారు. సొండిలను బిసి-ఎలో ఉండేలా కూటమి ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొండి రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షుడు మొగలిపురి సింహాచలపతి, రత్నాల రామారావు, రత్నాల వెంకటరావు, రత్నాల బాబూరావు, షావుకారి ముకుందరావు, నల్ల చిరంజీవి, షావుకారి చిరంజీవి, రత్నాల బలరాం పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న శరత్ ఊంద్రే

త్రిష హోండా షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలోని త్రిష హోండా అంటే స్థానికుల్లో మంచి గుర్తింపు ఉందని, ఈ గుర్తింపు, పేరును ఇలాగే కొనసాగాలంటే కస్టమర్లకు మంచి సేవలు మరింతగా అందించాలని హోండా కంపెనీ రాష్ట్ర ఇన్‌ఛార్జి శరత్ ఊంద్రే తెలిపారు. అధునాతన సాంకేతికను జోడిస్తూ... కస్టమర్లకు మెరుగైన సేవలందించేందుకు త్రిషా హోండా షోరూం, సేల్స్, సర్వీస్ సెంటర్లను ఏరియా మేనేజర్ మంజునాథ్ పాటిల్, ఎండి డి.ఎన్.రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కస్టమర్లు కోరుకున్న ఫీచర్స్‌ను అందించడమే లక్ష్యమన్నారు. బెంగుళూల్ ఏక్టీవా ఈ అనే ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాన్ని ప్రారంభించామన్నారు. త్వరలో ఇక్కడా అవి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. షోరూంలో సర్వీస్, సేల్స్, స్పేర్స్ విభాగాలను ప్రారంభించినట్టు చెప్పారు. మేనేజర్ హరిబాబు, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు, లుంగీలతో పేదలు

హెల్పింగ్ హేండ్స్ ఔదార్యం

కవిటి: మండలంలోని బొరివంక కేంద్రంగా పని చేస్తున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ మరో మారు తన ఔదార్యం చాటుకుంది. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్డు కిరువైపులా ఉన్న అభాగ్యులకు శుక్రవారం దుప్పట్లు, లుంగీలు అందించింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు కాళీసాహు మాట్లాడుతూ అభాగ్యులకు అండగా నిలవడంలో హెల్పింగ్ హేండ్స్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. రోడ్డుకిరువైపులా ఉండే 50 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

'ముత్తూట్ ఫైనాన్స్' ప్రారంభం

కవిటి: కవిటిలో నూతనంగా ఏర్పాటైన ముత్తూట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కవిటి కొత్తూరులోని గారమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు వద్దు... భూములే ముద్దు

మాట్లాడుతున్న రమణమూర్తి

ప్రజాశక్తి- మందస

అభివృద్ధి పేరిట ఈ ప్రజలకు అవసరం లేని ఎయిర్‌పోర్టు తీసుకొచ్చి పచ్చని ఉద్దానాన్ని అధ్వానం చేయొద్దని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ అధ్యక్షులు విశ్వర రమణమూర్తి అన్నారు. మండలంలోని రాంపురం పంచాయతీ టి.గంగువాడలో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోతున్న రైతులకు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థల ప్రతినిధులు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టపోతున్న రైతన్నలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామసభలు, ప్రజా ఆమోదం లేకుండా ఎయిర్‌పోర్టు పేరుతో 1400 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పే ప్రయత్నాలను ప్రభుత్వం నిలిపివేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెందాలంటే కొబ్బరి, జీడి, మునగ, మామిడి పరిశ్రమలు నెలకొల్పి ఉద్దాన ప్రాంత వాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొండే సూరి పాపారావు, శేఖర్, ఢిల్లీరావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘ నాయకులు నాగమణి, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, రాష్ట్ర అమరుల బంధు మిత్రుల సంఘాలు ధనలక్ష్మి, బాధిత రైతులు పాల్గొన్నారు.

నేడు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా శనివారం ర్యాలీ చేపడుతున్నామని, ఈ ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనాల గోపాల్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వస్తామని అన్నారు. పలాస డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో ఎక్కువగా యువత మత్తుకు బానిసై పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న దొంగతనాలు, చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడుతురని పేర్కొన్నారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతం పలాసలో రోజూ గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడుతున్నట్లు వింటున్నామని అన్నారు. మన చుట్టూ మనతోనే ఉన్న యువత వాళ్ల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నామని అన్నారు. యువతను సన్మార్గంలో నడిపే బాధ్యత మనందరిపైనా ఉందని భావించి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం... చేయి చేయి కలిపి చెడును పారద్రోలుదాం అనే నినాదంతో ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి ఉద్యోగ, కార్మిక, అన్ని ప్రజా సంఘాల నాయకులు, వైద్యులు, ఎక్సైజ్ పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణమూర్తి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నో ప్రభుత్వాలు మారి కాలం గడుస్తున్నప్పటికీ పురపాలక సంఘంలోని ఉపాధ్యాయులకు ఎదురుచూపులే మిగులుతున్నాయని, వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు పురపాలక ఉపాధ్యాయులు ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణ మూర్తి దృష్టికి తీసుకువచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పురపాలక సంఘంలోని ఉపాధ్యాయుల సమస్యల సేకరణ సభ్యత్వ నమోదులో భాగంగా కృష్ణాపురం, లక్ష్మీనగర్, మెట్టక్కివలస, గర్ల్స్ హై స్కూల్, గేటు తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్ పాఠశాలలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో 22 ఏళ్లగా పురపాలక ఉపాధ్యాయులు పిఎఫ్ ఖాతాలకు ఎదురుచూస్తున్నామని, లక్షల రూపాయలు ఎటుపోతుందో తెలియడం లేదని, అప్‌గ్రేడ్ చెందిన పాఠశాల్లో ఇప్పటికీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాలేదన్నారు. కనీసం జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు లభించిన సౌకర్యాలు కూడా తమకు లభించడం లేదన్నారు. ఈ సమస్యలపై రమణమూర్తి స్పందిస్తూ పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను ఎస్‌టియు తీవ్రంగా పరిగణిస్తుందని, సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు వెంటనే పిఎఫ్ ఖాతాలు తెరవాలని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తమ్మినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రమణ, జి.నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ ఇడిగా వినాయకం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఇడిగా కె.వినాయకం నియమితులయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కొంత కాలంగా వెయిటింగ్‌లో కొనసాగుతున్న ఆయనను శ్రీకాకుళం బదిలీ చేశారు. అలాగే జిల్లాలోని కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం భూసేకరణ స్పెషల్ తహశీల్దార్‌గా ఉన్న పప్పల వేణుగోపాలరావును కాకినాడ సమగ్ర శిక్ష ఎపిసిగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీల్లో భాగంగా వీరికి స్థానచలనం కలిగింది.

పశు పోషణపై జాగ్రత్తలు పాటించాలి

దుర్గారావు, ఎడి

ప్రజాశక్తి- రణస్థలం

మారుతున్న సీజన్‌కు అనుగుణంగా పంటల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో.. పాడి పశువుల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని రణస్థలం పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు బుడుమూరు దుర్గారావు పాడి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు మేతమేయడానికి అంత ఆసక్తి చూపవని, దీనివల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని, పశువులకు అందించే దాణా విషయంలో మార్పులు చేసుకోవాలని, పాలు తీసే సమయాన్ని కూడా మార్చుకుంటే మంచిదన్నారు. పాలను ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య పితకడం మంచిదన్నారు. చలికాలంలో దోమ కాటు, ఇతర వైరస్‌ల వ్యాప్తి వల్ల గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, పశు వైద్యాధికారి సూచన మేరకు పశుదాణాలో పోషక విలువలు, మాంసకృతులు, శక్తినిచ్చే పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి తొట్టెలో నీరు ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలని, చలికాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ముందుగానే వైద్యాధికారి సూచనతో ఈ వ్యాధికి సంబంధించిన టీకాను వేయించాలన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

సభ్యత్వ నమోదును అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం గ్రామాల్లో జోరుగా సాగుతుంది. మండలంలోని అమలపాడు, ఉద్దానం రామకృష్ణాపురం, కొండవూరు గ్రామాల్లో టిడిపి నాయకులు గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ... టిడిపి సభ్యత్వ నమోదు వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. రూ.వంద సభ్యత్వంతో రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందని అన్నారు. అమలపాడులో ఒక్కరోజే 250 సభ్యత్వాలు నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి మండల నాయకులు దున్న షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ చింత నారాయణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, వై.భాస్కరరావు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంకులూరులో మహిళలపై హింసను అరికట్టాలంటూ శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో మహిళలతో జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెండర్ అంటే స్త్రీ, పురుష బేధం లేకుండా సమానత్వం పాటించాలన్నారు. మహిళాభివృద్ధి అందరూ కృషి చేయాలన్నారు. బాలికల అక్రమ రవాణా అరికట్టాలి, లింగ వివక్షతను నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 23 వరకు కొనసాగుతుందని అన్నారు. ర్యాలీలో ఎంపిటిసి కొండప్ప సురేఖ, సిసి హరిప్రియ, ఐ.ఎ విజయలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

తెలగ సంక్షేమ భవనానికి ఎసిలు అందజేత

చెక్కు అందజేస్తున్న కనకమహాలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన భవనంలో నాలుగు ఎసిలను ఊడి కనకమహాలక్ష్మి శుక్రవారం అందజేశారు. తన భర్త సూర్యప్రకాష్ జ్ఞాపకార్థం వాటిని సంక్షేమ భవనానికి అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నాయుడు, పిల్లల నీలాద్రి, ఊడే శ్యామ్, పూడి సునీత, గ్నెటి సుధారాణి, పత్తి జయలక్ష్మి, కొండ రాంబాబు, రమణారావు, చిట్టిబాబు, ఎం.నాగేశ్వరరావు, పి.దయానంద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

రామారావుకు అభినందనలు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని రొంపివలసకు చెందిన టిడిపి నాయకులు, ఆర్మీ మాజీ ఉద్యోగి పిట్ట రామారావు ఎక్కువ శాతం టిడిపి సభ్యత్వ నమోదుకు కృషి చేశారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు రామారావును తన కార్యాలయంలో శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడే పార్టీ టిడిపి అని అన్నారు. విధిగా సభ్యత్వ నమోదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బుద్దుల నరేష్, ఎరుకోల కృష్ణారావు, రావాడ సోమేష్ పాల్గొన్నారు.

చేప పిల్లలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు

చేప పిల్లల పంపిణీ

మెళియాపుట్టి : సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన గిరిజనులకు వంద శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు పరశురాంపురం సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సచివాలం వద్ద గిరిజనులకు శుక్రవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని అన్నారు. చేపల పెంపకం ద్వారా గిరిజన మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజు, లక్ష్మీపురం కిరణ్, పొట్నూరు ఉదయ్, గణేష్ పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ అందజేస్తున్న రేణుక

చక్రాల కుర్చీ అందజేత

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో ఉన్న వృద్ధుల కోసం హైదరాబాద్‌కు చెందిన ఐబిఎం, గూడెర సంస్థలు చక్రాల కుర్చీని ఉచితంగా అందజేశారు. విశాఖ నగరానికి చెందిన రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షులు మాడుగుల రేణుక, హరికృష్ణ ఆధ్వర్యాన మేరకు శుక్రవారం అనురాగ నిలయాన్ని సంస్థ సభ్యులు సందర్శించి అందజేశారు.

రబీ డ్రై షోయింగ్‌పై అవగాహన

ఆమదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రబీలో అంతర పంటల సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డిజిటల్ యల్.టు సురేష్ మాట్లాడుతూ నిమ్మతొర్లువాడలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో చోడి విత్తనాలను విత్తన శుద్ధి చేసి నారుమడిలో ఘన జీవామృతం వేసుకుని వేయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో అపరాలలో అంతర పంటల సాగు పద్ధతులను రైతులకు తెలియజేస్తూ రబీ డ్రై షోయింగ్ పద్ధతులను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.